## క్లుప్తంగా

### ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



కోలాటం ఆడుతున్న మహిళలు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవాన్ని గ్రామస్తులు శని వారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేయ డంతో పాటు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది.

### జిల్లా గ్రంథాలయ సేవా సంఘంలో చోటు



నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్‌రవూఫ్, అధ్యక్షుడు ఎర్నాయుడు

శృంగవరపుకోట: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో పని చేసేందుకు ఎస్.కోట మండలానికి కన్వీనర్, కో–కన్వీనర్ల నియామకాలను ఆసంఘం చేపట్టింది. మండల కమిటీ కన్వీనర్‌గా కె.వెంకటరావు, కో–కన్వీనర్‌గా మామిడిపల్లి మాజీ సర్పంచ్ టి.గంగాభవానిని నియమిస్తూ జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, అధ్యక్షుడు కొత్తలి ఎర్నాయుడు శనివారం నియామకపత్రాలు అందజేశారు. వీరిద్దరూ ఏడాది పాటు ఈ పదవిలో ఉంటారని అబ్దుల్ రవూఫ్ చెప్పారు. మండల కన్వీనర్ వెంకటరాము మాట్లాడుతూ కొత్త గ్రంథాలయాల ఏర్పాటుకు, పాత గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు.

### జెడ్పీ నిధులతో బోరు ఏర్పాటు



బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పారావు, తదితరులు

వేపాడ: మండలంలోని కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బోరు ఏర్పాటుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేశారని జెడ్పీటీసీ ఎస్.అప్పారావు తెలిపా రు. స్థానిక ఎంపీటీసీ ఏ.ఈశ్వరరావుతో కలిసి బోరు డ్రిల్లింగ్ పనులకు శనివారం భూమి పూజ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి మాట్లాడుతూ మండలానికి రూ.10లక్షల జిల్లా పరిషత్ నిధులతో పదిబోర్లు మంజూరు చేశామని చెప్పారు.వల్లంపూడిలో మూడు, బల్లంకి, వీలుపర్తి, ఆతవ, వావిలపాడు, బొద్దాం, కొండగంగుబూడి, ముకుందపురం గ్రామాల్లో ఒక్కోబోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కరకవలస వైస్ సర్పంచ్ దుల్ల అప్పన్న, ఆలయ అర్చకులు లట్టాల పవన్ శర్మ, స్థానిక నాయకులు దివాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### యథేచ్ఛగా 'బ్లాక్'లో టికెట్ల విక్రయాలు



కొత్తవలసలో లక్ష్మీనరసింహ థియేటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు

శృంగవరపుకోట: సంక్రాంతి సందడిలో సినీ ప్రేక్షకులను బ్లాక్ కేటుగాళ్లు యథేచ్ఛగా దోచేస్తున్నారు. దర్జాగా బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్నారు. కొత్తవలసలోని లక్ష్మీన రసింహ థియేటర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి సంబంధించిన టికెట్లను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని, ఆన్‌లైన్‌లో ఒక్క టికెట్ కూడా దొరకడం లేదని కొందరు స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ నీలకంఠరావు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో థియేటర్ వద్దకు సగటు ప్రేక్షకుడిలా వెళ్లారు. తహ సీల్దార్‌ను గుర్తించని సదరు బ్లాక్‌లో టికెట్లు అమ్ముకుంటున్న వ్యక్తి ఆయన ఎదురుగానే బ్లాక్‌లో టికెట్లు అమ్మాడు. దీంతో పక్కనే ఉన్న వీఆర్‌ఓ రాధాకృష్ణకు చెప్పి సద రు కేటుగాడి వద్ద ఉన్న టికెట్లు తీసుకుని సీజ్ చేశారు. థియేటర్ యాజమాన్యంపై చర్యలకు జిల్లా అధికారులకు సిఫార్సు చేస్తామని తహసీల్దార్ చెప్పారు. అదే సమ యంలో థియేటర్ క్యాంటీన్‌ను తహసీల్దార్ పరిశీలించారు. కనీసం శానిటేషన్ లేదని, ధరల పట్టిక లు ఎక్కడా కనిపించలేదని, సామాన్యులను దోచుకునే ఈతరహా చర్యలకు చెక్‌పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

---

# గప్‌చుప్.. ఎక్కడి గుంతలు అక్కడే

- సంక్రాంతి కల్లా గుంతలు లేని రోడ్లు చూస్తారని ప్రజలకు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు
- చీపురుపల్లి నియోజకవర్గంలో మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- అక్కడక్కడా పనులు ప్రారంభించి... అరకొరగా చేసి వదిలేసిన వైనం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గోతులు తేలిన కొండలక్ష్మీపురం గ్రామ రోడ్డు



చీపురుపల్లిరూరల్(గరివిడి): శిథిలమైన ఏనుగువలస గ్రామానికి వెళ్లే రోడ్డు



చీపురుపల్లి: చీపురుపల్లి నుంచి వెదుల్లవలస వెళ్లే రోడ్డులో గోతులు



చీపురుపల్లి: అధ్వానంగా తయారైన జి.అగ్రహారం నుంచి ఏనుగువలస వెళ్లే రోడ్డు

చీపురుపల్లి: సంక్రాంతి పండగకు గ్రామాల్లోకి అందరూ వచ్చే సమయానికి రోడ్లు అద్దంలా మెరిసిపోయేలా చేస్తాం, పాడైన ప్రతీ రోడ్డుకు మరమ్మతులు చేయించి కొత్తరోడ్లు మాదిరిగా తయా రు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెప్టెంబర్‌లో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సీఎం ఇచ్చిన హామీకి క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు అస్సలు పొంతన లేకుండా పోయింది. సంక్రాంతి పండగ వెళ్లిపోయి నాలుగు రోజులు అవుతున్నా చీపురుపల్లి నియోజకవర్గంలో ఎక్కడా ఒక్క గుంత కూడా పూడ్చలేదు. సెప్టెంబర్ నాటికి రోడ్లు ఎలా ఉన్నాయో ఇప్పటికే అలా నే దర్శనమిస్తున్నారు. పాడైన రోడ్లు చాలా ఉన్నప్పటికీ కొన్నిరోడ్లకు మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, ఆనిధులతో కూడా పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం నియో జకవర్గంలో రోడ్లపై ఉన్న గుంతలు అద్దంలా మెరిసిపోతు న్నాయన్న విమర్శలు ప్రజలు నుంచి వినిపిస్తున్నాయి నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లి నుంచి గరివిడి మండలంలోని వెదుల్ల వలస మీదుగా ఉత్తరావల్లి జంక్షన్ వరకు (శ్రీకాకుళం నుంచి సాలూరును కలిపే) ఉన్న రోడ్డు గుంతలతో ప్రయాణికులను అవస్థలకు గురి చేస్తోంది. ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. చీపురుపల్లి నుంచి లావేరురోడ్ మరమ్మతులకు రూ.10 లక్షలు, అలజంగి నుంచి ఇటకర్లపల్లి రోడ్డుకు రూ.8 లక్షలు, కరకాం జంక్షన్ నుంచి శ్రీకాకు ళం జిల్లాలోని దేవరాపల్లి జంక్షన్‌కు రూ.7 లక్షలు, కర్లాం రోడ్డుకు రూ.4 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇందులో చీపురుపల్లి నుంచి లావేరురోడులో పనులు చేపట్టారు. మిగిలిన రోడ్లన్నీ టెండర్లు పూర్తయినప్పటికీ ఇంకా పనులు పూర్తి కాలేదు.

**ప్రయాణికులకు తప్పని తిప్పలు**

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలో పలు గ్రామాల రోడ్లు మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొండలక్ష్మీపురం, ఏనుగువలస గ్రామాల రోడ్లు ఎక్కడికక్కడ గోతులు తేలి రాకపోకలు సాగించలేని విధంగా తయారయ్యాయి.గరివిడి పట్టణం లోని ఆర్‌ఓబీ రోడ్డుతో పాటు ఆర్‌ఓబీ కింద ఉన్న ప్రధాన రోడ్డు గోతులమయమైంది. అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల్లో ప్రయాణం సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

**శంకుస్థాపనతో సరిపెట్టారు..**

గుర్ల: మండలంలోని ఆనందపురం నుంచి చింతలపేట మీదుగా నెల్లిమర్ల మండలంలోని పూతికపేట వరకు ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఈ రోడ్డును పున రుద్ధరించేందుకు అధికారు లు ప్రతిపాదనలు చేయడంతో కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. పనులకు శంకుస్థాపన చేసి వదిలేశారు. దమరసింగి నుంచి సతివాడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభమైనప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. గుర్ల నుంచి కెల్ల గ్రామానికి వెళ్లే రోడ్డు, శేషపుపేట రోడ్డు గోతులు తేలి అధ్వానంగా తయారయ్యాయి. ఈరోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.



గుర్ల: గుర్ల నుంచి కెల్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో రెల్లిపేట వద్ద తేలిన గోతులు

**ప్రారంభించి వదిలేశారు...**

మెరకముడిదాం: మండలంలోని గర్భాం– గరివిడి, గర్భాం– ఉత్తరావల్లి గ్రామాల ప్రధాన రహదారులు గోతులమయమయ్యాయి. అలాగే సోమలింగాపురం నుంచి గరివిడి మండలం బొండ పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుదీ అదే పరిస్థితి. సంక్రాంతి నాటికి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని ప్రభుత్వ పెద్దలు హామీలు ఇచ్చినప్పటికీ ఎక్కడా మరమ్మతులు చేపట్టకపో వడంపై ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు మండిపడుతున్నారు. గరివిడి– గర్భాం రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించి మధ్యలో వదిలేశారు.



మెరకముడిదాం: గర్భాం- గరివిడి ప్రధాన రహదారిలో తేలిన గోతులు



గుర్ల: గోతులతో అధ్వానంగా ఉన్న ఆనందపురం-చింతలపేట రోడ్డు

---

## రైల్వేస్టేషన్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు



రైల్వేస్టేషన్ వద్ద చేపడుతున్న ముఖద్వారం నిర్మాణ పనులు



ప్లాట్‌ఫామ్ ఎత్తు పెంచే పనులు



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



ప్రయాణికులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న షెల్టర్లు

చీపురుపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో దేశ వ్యాప్తంగా 500కు పైగా రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయి. చీపురుపల్లి రైల్వేస్టేషన్ కూడా అమృత్ భారత్ పథకానికి ఎంపికయ్యింది. అప్పటిలో మంజూరైన నిధులతోనే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే రైల్వేస్టేషన్ స్వరూపమే మారనుంది. ప్రస్తుతం ఉన్న టిక్కెట్ కౌంటర్, స్టేషన్‌మాస్టర్ గది, సిగ్నల్ రూమ్ స్థానంలో కొత్త నమూనాతో స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఒకటే ఉంది. ఇప్పుడు మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. అలాగే ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌లపై వేచి ఉండేందుకు అదనంగా షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫామ్‌ను మరింత ఎత్తు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు రెండోవైపు కూడా టిక్కెట్ కౌంటర్ అందుబాటులోకి రానుంది.

## ఎల్‌ఐసీ జాతీయీకరణ దినోత్సవం

శృంగవరపుకోట: స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఎల్‌ఐసీ జాతీయీకరణ దినోత్సవాన్ని శనివారం నిర్వ హించారు. ఈసందర్భంగా కార్యాలయం ఎదుట వారు మాట్లాడుతూ ఏడు దశాబ్దాల క్రితం నుంచి ఎల్‌ఐసీ దేశ ప్రజల అవసరాలు తీరుస్తూ, ఆదుకుంటోందన్నారు. ఎన్‌డీఏ సర్కారు బీమారంగాన్ని ప్రైవేటీకరించాలని విశ్వప్రయత్నాలు చేస్తోందని, ఈ దశలో దేశాభివృద్ధిలో కీలకమైన ఎల్‌ఐసీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఏజెంట్లు, డీఓలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఐఆర్‌డీఏఐ, కేంద్ర ప్రభుత్వాలు ఎల్‌ఐసీకి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నాయని, వాటిని అడ్డుకునే క్రమంలో బలమైన ఇండియా కోసం–బలమైన ఎల్‌ఐసీ అన్న కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎస్.కోట బేస్ యూనిట్ కార్యదర్శి శివ, కార్యాలయ సిబ్బంది, ఏజెంట్లు, డీఓలు పాల్గొన్నారు.

## పరామర్శ..



రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బొత్స అప్పలనరసయ్య, తదితరులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు రాజశేఖరం కుటుంబ సభ్యులను పాలకొండలోని వారి స్వగృహంలో శనివారం పరామర్శించారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



గజపతినగరం: పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు



శృంగవరపుకోట: ఎస్.కోట ఉన్నత పాఠశాలలో పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ నర్సింగరావు

గజపతినగరం: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాం తంగా ముగిసింది. మండల కేంద్రంలోని పురిటిపెంట బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర హైస్కూల్, శ్రీకృష్ణ విద్యా పీఠ్ పాఠశాల కేంద్రాలుగా నిర్వహించిన పరీక్షకు మండలంలోని 544 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి(డిప్యూటీ డీఈఓ) మోహన్‌రావు పరిశీలించారు. పురిటిపెంట బాలికోన్నత పాఠశాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవోదయ ప్రవేశపరీక్షకు మండలంలో దరఖాస్తు చేసుకున్న 608 మంది విద్యార్థుల కోసం గజపతినగరంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 544 మంది హాజరయ్యారని చెప్పారు.ఆయన వెంట ఉపాధ్యాయులు చిప్పాడ రమేష్ కుమార్, బి.వెంకటరమణ ఉన్నారు.

**736 మంది హాజరు..**

శృంగవరపుకోట: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా పూర్తయ్యిందని ఎంఈఓ బి.నర్సింగ రావు చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత , ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలతో పాటు నారాయణ కేంబ్రిడ్జ్, రవీంద్ర భారతి పాఠశాల కేంద్రాలుగా పరీక్ష నిర్వహించా మని తెలిపారు.ఒక్కో కేంద్రంలో 216 మంది చొప్పున మొత్తం 816 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 736 మంది హాజరయ్యారని, పరీక్షల నిర్వహణకు 36 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు ఎంఈఓ చెప్పారు.

## పనితీరు మెరుగుపరుచుకోవాలి

- డీఎంహెచ్‌ఓ జీవనరాణి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

బొండపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ)ని వైద్యసిబ్బంది తమ పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని డీఎంహెచ్‌ఓ జీవనరాణి సూచించారు.స్థానిక పీహెచ్‌సీ లో శనివారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. మందుల నిల్వలను పరిశీలించారు. రోజువారీ ఓపీ నమోదుపై సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని, ప్రసవాలు స్థానికంగానే చేయాలని, అత్యవసర పరిస్థితిలోనే ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయాలని చెప్పారు. మందుల కొరత రాకుండా చూసుకోవాలని, ఆశ కార్యకర్తలు,సచివాలయ ఏఎన్‌ఎంల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, సమీరాకు సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది, మండలంలోని పలుశాఖల ఉద్యోగులు శుభ్రం చేశారు. అలాగే గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో కలిసి అధికారులు, నాయకులు పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్




శృంగవరపుకోట: ఎస్.కోటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు



గుర్ల: గుర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, అధికారులు



మెరకముడిదాం: గర్భాంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ర్యాలీ చేస్తున్న అధికారులు



కొత్తవలస: కొత్తవలసలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, మహిళలు



బొండపల్లి: అంబటివలసలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది



వేపాడ: వేపాడలో ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

## పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చీపురుపల్లి: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న పశుఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను చీపురుపల్లిలో శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరాల్లో పశువులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు, పశువులకు శస్త్ర చికిత్సలు చేస్తారని చెప్పారు.పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.శారద, తహసీల్దార్ ఎన్.రాజారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**ఈనెల 20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు**

గంట్యాడ: మండలంలో ఈనెల 20 నుంచి 31వతేదీ వరకు రోజుకి రెండు గ్రామాల్లో చొప్పున పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్.కృష్ణ తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గ్రామీణ పశు వైద్యశాలల వైద్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గొర్రెలు, ఆవులు, గేదెలు, లేగదూడలకు నట్టల నివారణ మందులు పట్టనున్నట్లు చెప్పారు. అలాగే కోళ్లకు కొక్కర తెగులు, మశూచి వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.



చీపురుపల్లి: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు